# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన-1** **తేదీ. 18-10-2014**

తెలంగాణ సమాజం గుర్తుంచుకోవాల్సిన, గౌరవించుకోవాల్సిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి అంజయ్య అని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. అంజయ్య వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి శనివారం ఉదయం లుంబిని పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంజయ్య వివిధ హోదాల్లో ప్రజలకు అనేక రకాల సేవలు అందించారని ముఖ్యమంత్రి కొనియాడారు. చిన్న కార్మికుడి స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన నాయకుడు అని అన్నారు. జీవితమంతా ప్రజలతో సంబధం కలిగివున్న నాయకుడని చెప్పారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత తానుంటున్న అధికార నివాసానికి 'జై ప్రజా భవన్' అనే పేరు పెట్టుకున్నారని, ప్రజలు బాగుండాలని కోరుకున్నారని గుర్తు చేశారు. తన అధికార నివాసం ప్రజల భవనం అని, ప్రజలకు ఆలవాలం అని చెప్పడానికే ఈ పేరు పెట్టుకున్నారని వివరించారు. ప్రజల కోసం, ప్రజల మధ్యన బతికిన ప్రజల మనిషి అంజయ్య అని చెప్పారు. కార్మిక బంధుగా పేరు తెచ్చుకున్నారన్నారు. కార్మిక మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా పలు పదవులు పొందిన అంజయ్య నిరంతరం ప్రజల కోసం బతికాడని కొనియాడారు. 1969 ఉద్యమంలో అంజయ్య చాలా కీలకపాత్ర పోషించారని, అగ్రభాగాన నిలిచి ఉద్యమం నడిపారని, నెలల తరబడి జైలు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. అంజయ్యను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునే విధంగా ఆయన స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. ఆయన ప్రాతినిధ్యం వహించిన ముషీరాబాద్ నియోజకవర్గంలో పెద్ద విగ్రహం నెలకొల్పి, జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే ప్రముఖ విద్యాసంస్థకు అంజయ్య పేరు పెడతామన్నారు. హైదరాబాద్ లోని ఓ ఉద్యానవనానికి కూడా అంజయ్య పేరు పెడతామన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం